# కాంగ్రెస్‌ను నమ్మితే గోస పడుతాం

- కాంగ్రెస్, బీజేపోళ్లు వారే గెలువాలనుకుంటరు
- బీఆర్ఎస్ మాత్రం ప్రజలు గెలువాలనుకుంటది
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో మంత్రి వేముల

మోర్తాడ్, నవంబర్ 15 : కాంగ్రెస్‌ను నమ్మితే గోస పడుడే అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో బుధవారం బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపోళ్లు వారే గెలువాలని కోరుకుంటారని.. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రజలు గెలువాలని కోరుకుంటుందని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడపడంతోపాటు, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపోళ్లు ఇచ్చే డబ్బులు తీసుకోండి కానీ, అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. 'కాంగ్రెసోళ్లు వచ్చి చందమామను మీఇంటి మీద పెడతాం' అనేలా మాటలు చెబుతారని, వారి మాటలు నమ్మితే మళ్లీ గోసపడక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో ఇంత అభివృద్ధి, ఇంతటి శాంతి ఉన్నదా? ఒక్కసారి ఆలోచించాలని కోరారు. కర్ణాటకలో గెలిచిన తరువాత ఒక్క గ్యారెంటీని కూడా తీర్చలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉన్నదని, వాళ్లు చెప్పడం తప్ప చేసేదేమీ లేదని తెలిసిపోయిందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఒక తండ్రిలాగా కేసీఆర్ వివిధ సంక్షేమ పథకాలకు అందిస్తున్నారని, తిరిగి బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను బలపరచాలని కోరారు. బాల్కొండలో వేముల ప్రశాంత్‌రెడ్డి గెలిస్తేనే ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలు, నూతన మ్యానిఫెస్టో ప్రకారం అమలవుతాయని తెలిపారు.

## అక్కడ చేయనోళ్లు ఇక్కడ చేస్తారా?: వేముల

ఇతర రాష్ట్రాల్లో అధికారంలో ఉండి చేయని కాంగ్రెస్ నేతలు తెలంగాణలో ఇది చేస్తాం.. అది చేస్తామని పెద్దపెద్ద మాటలు చెబుతున్నారని, అధికారం ఉన్న దగ్గర చేయని వాళ్లు లేని దగ్గర ఎట్ల చేస్తారో ప్రజలు ఆలోచించాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కర్ణాటకలో గెలిచిన నెలకే గ్యారెంటీలు అమలు కాని పరిస్థితి ఉన్నదని, అక్కడి వారు కరెంటు కష్టాలు పడుతున్నారని తెలిపారు. ఇటు మహారాష్ట్రలో బీజేపీ పాలనలో కూడా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. 'తెలంగాణ రాక ముందు మనం ఎట్ల ఉన్నం? తెలంగాణ వచ్చినంక ఎట్ల ఉన్నమో?' ఒకసారి ఆలోచించాలని కోరారు.

# కాంగ్రెస్‌లో ఉపసంహారణం

- నామినేషన్ల ఉపసంహరణ వేళ నిరసనల సెగ
- బుజ్జగింపులకు వెళ్లిన నేతలపై తిరుగుబాటు
- సూర్యాపేటలో మల్లుపై రమేశ్‌రెడ్డి అనుచరుల దాడి
- పార్టీని వీడిన సీనియర్లు.. ఆదిలాబాద్ బరిలో సంజీవరెడ్డి



బుధవారం సూర్యాపేటలో మల్లు రవిని అడ్డుకుంటున్న పటేల్ రమేశ్‌రెడ్డి అనుచరులు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆది నుంచి అసమ్మతి సెగలు కక్కుతున్న కాంగ్రెస్ పార్టీలో నామినేషన్ల ఉపసంహరణ రోజూ నిరసనల సెగ తప్పలేదు. రెబల్స్‌తో పార్టీ జాతీయ నాయకులు జరిపిన చర్చల సందర్భంగా పలుచోట్ల నేతలకు టెన్షన్ తప్పలేదు. చర్చల కోసం వచ్చిన నాయకులను రెబల్ అభ్యర్థుల మద్దతుదారులు భౌతికదాడులకు దిగారు. కొన్నిచోట్ల రెబల్స్ నామినేషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ.. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. మరికొంతమంది కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బరి నుంచి తప్పుకున్న నేతలకు తర్వాత పదవులు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. టికెట్ కేటాయించాక మరొకరికి బీఫామ్ ఇచ్చిన పరిస్థితులను కొందరు మరువులేక లోలోన రగిలిపోతున్నారు. దీంతో పార్టీ తరపున బరిలో ఉన్న అభ్యర్థులు రెబల్స్‌గా విత్‌డ్రా చేసుకున్నా వారిని పూర్తిస్థాయిలో నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు మరో 15 రోజుల గడువు మాత్రమే ఉండటంతో రెబల్స్ క్యాడర్ పార్టీ అభ్యర్థికి ఎంతవరకు సహకరిస్తారనేది అనుమానంగా మారింది. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి టీపీసీసీ నాయకులు సంజీవరెడ్డి కాంగ్రెస్ రెబల్‌గా బరిలో నిలిచారు. బోథ్ నియోజకవర్గం నుంచి మొదటి జాబితాలో టికెట్ ఇచ్చిన వన్నెల అశోక్ నామినేషన్ దాఖలు చేశారు. చివరికి ఆయన స్థానంలో మరొకరికి టికెట్ కేటాయించడంతో అశోక్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన బుధవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన గంగారాం, బాన్సువాడలో కాసుల బాలరాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా డోర్నకల్‌లో నెహ్రూనాయక్, వరంగల్ వెస్ట్‌లో జంగా రాఘవరెడ్డి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో దండెం రాంరెడ్డి, ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో వన్నెల అశోక్, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నాగిశేఖర్, సంగారెడ్డి జిల్లా అనిల్‌కుమార్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

### పటేల్ రమేశ్‌రెడ్డి అనుచరుల్లో అయోమయం

సూర్యాపేట నియోజకవర్గం నుంచి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పటేల్ రమేశ్‌రెడ్డితో నామినేషన్‌ను విత్ డ్రా చేయించేందుకు రాయబారానికి వచ్చిన పీసీసీ సీనియర్ నేత మల్లు రవికి చేదు అనుభవం ఎదురైంది. నామినేషన్ విత్ డ్రాకు వెళ్లకుండా రమేష్‌రెడ్డి అనుచరులు మల్లు రవిని అడ్డుకొని దాడి చేశారు. ఈ నేపథ్యంలో మల్లు రవి ఏఐసీసీ నేతలతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా అవకాశం కల్పిస్తామని హామీ ఇప్పించారు. అనంతరం ఆయన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి తన నామినేషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. కానీ ఈ పార్లమెంట్ స్థానం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ఇప్పటికే సీఎల్పీ నేత జానారెడ్డి అధిష్ఠానానికి స్పష్టం చేయడంతో రమేశ్‌రెడ్డి అనుచరుల్లో అయోమయం నెలకొంది.



మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కి తిలకం దిద్దుతున్న మహిళ

## కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థికి మహిళల మద్దతు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 15: 'మా మద్దతు నీకే.. గెలుపునీదే అన్నా' అంటూ కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను మెట్‌పల్లి మండల ఆడబిడ్డలు దీవించారు. బుధవారం ఆయన కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి మండలంలో విస్తృత ప్రచారం చేయగా.. ఆయా గ్రామాల్లో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఏ గ్రామానికి వెళ్లినా తిలకం దిద్ది.. ఆశీర్వాదాలు అందించారు. సీఎం కేసీఆర్ ఆడబిడ్డల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ నెల 3న కోరుట్ల ప్రజా ఆశీర్వాద సభలో బీడీ కార్మికులందరికీ పింఛన్లు ఇస్తామని ప్రకటించారని, తాము ఎన్నటికీ మరిచిపోమని చెప్పారు. ఈ సారి ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు.

## మిడ్జిల్‌లో బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నేతల దాడి



మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

మిడ్జిల్, నవంబర్ 15: బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు దాడి చేసిన ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో చోటుచేసుకున్నది. కొంతమంది యువకులు పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల (నిరుద్యోగులు) ముసుగులో సీఎం కేసీఆర్‌కు ఓటు వేయొద్దని కరపత్రాలు పంచుతున్నారు. దీనిని గమనించిన బీఆర్ఎస్ యువ నేతలు అడ్డుకుని విచారించగా.. వాళ్లు అసలు యూనివర్సిటీ విద్యార్థులు కాదని తేలింది. కాంగ్రెస్ నాయకులు తప్పుడు కరపత్రాలు ముద్రించి కొంత మంది యువకులకు కూలి డబ్బులు చెల్లించి బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేయిస్తున్నట్టు గుర్తించారు. వారి నుంచి కరపత్రాలను స్వాధీనం చేసుకుంటుండగా.. తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువురితో మాట్లాడి సమస్య పెద్దది కాకుండా చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుధాబాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు జంగిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్‌కు గాలి అనిల్‌కుమార్ రాజీనామా

- పని చేసే వారికి పార్టీలో గౌరవం లేదని ఆవేదన
- టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని మనస్తాపం



రాజీనామా లేఖను చూపిస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్

పటాన్‌చెరు, నవంబర్ 15: కాంగ్రెస్ పార్టీకి టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపినట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లా అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయ న వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతల తీరుతో మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశానని, ఖర్చుకు వెనుకాడకుండా పని చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కష్టపడ్డ వారిని కాదని.. టికెట్ కావాలని దరఖాస్తు చేసుకోని వారికి కూడా బీ ఫాం ఇవ్వడం అన్యాయమని చెప్పారు. కాంగ్రెస్‌లో కష్టపడిన వారికి న్యాయం లేదని విమర్శించారు. కార్యకర్తలు, అభిమానుల ఒత్తిడి మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేశానని గాలి అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. తనతోపాటు పెద్దసంఖ్యలో అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌ను వీడుతారని ఆసక్తి రేకెత్తించారు. తన అనుచరులతో చర్చించి త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పారు.

